


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 260 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 10-1 -2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

## మెక్సికోపై సైనికచర్య చేపడుతాం:

### డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

- అక్కడ్నుంచే డ్రగ్ కార్టెల్స్ ఏరివేత
- మా దేశం అమెరికా జాగీరు కాదు: మెక్సికో అధ్యక్షరాలు




**న్యూఢిల్లీ:-- జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వెనెజువెలాపై చర్యలు తీసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్ను ఇప్పుడు మెక్సికోపై పడింది. మెక్సికోలోని డ్రగ్ కార్టెల్స్(సిండికేట్లు)కు వ్యతిరేకంగా తన ప్రభుత్వం క్షేత్రస్థాయి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ట్రంప్ గురువారం ప్రకటించారు. మెక్సికోను డ్రగ్ కార్టెల్స్ నియంత్రిస్తున్నాయని, ఆ దేశ పరిస్థితి చూస్తే విచారంగా ఉందని ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో -మిగతా 2 లో

## బొగ్గు స్కామ్‌లో అమిత్ షా!

- ఈడీ దాడులపై భారీ నిరసన
- నన్ను బెదిరించొద్దు.. మీ గుట్టు మొత్తం విప్పుతా
- ఆ స్కామ్ సొమ్ము మీకే చేరింది
- నా వద్ద పెన్‌డ్రైవ్ సాక్ష్యలున్నాయి
- అమిత్ షాకు మమత హెచ్చరిక



**న్యూఢిల్లీ, - జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ వ్యూహకర్త ఐ-ప్యాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు జరపడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై శుక్రవారం విరుచుకుపడ్డారు. తనపైన, తన ప్రభుత్వంపైన ఓ స్థాయికి మించి ఒత్తిడి పెంచితే బొగ్గు కుంభకోణంలో అమిత్ షా పాత్రకు -మిగతా 2 లో



## 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్
- తిరిగి మార్చి 9వ తేదీన పార్లమెంట్ సమావేశతిరిగి మార్చి 9వ తేదీన పార్లమెంట్ సమావేశం

**న్యూఢిల్లీ**
ఈ నెల 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర బడ్జెట్‌ను పార్ల మెంట్‌కు సమర్పించనున్నారు. జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారని అధికారులు శుక్రవారం తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ తాత్కాలికంగా ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసిందని చెప్పారు. ప్రతి ఏటా పార్లమెంట్ మొదటి సమావేశం మొదటి రోజున రాష్ట్రపతి ప్రసంగించడం ఆనవాయితీగా వస్తోంది. బీటింగ్ రిట్రీట్ ఉత్సవం కారణంగా 29వ తేదీన ఉభయ సభలు సమావేశం కావు. తిరిగి 30వ తేదీన పార్లమెంట్ -మిగతా 2 లో




# జల వివాదాలకు చెక్ పెడదాం

### ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్
- బల్క్ డ్రగ్స్ తయారీ 40 శాతం తెలంగాణలోనే
- జర్మన్ టెక్నాలజీతో ఐవీ ఫ్లూయిడ్స్
- రంగారెడ్డి జిల్లా ఈ-సిటీలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ప్రారంభం



**రంగారెడ్డి -- జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
నదీజలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటామని చెప్పారు. కృష్ణా జలాల విషయంపై కూర్చొని మాట్లాడుకుందామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల్‌లోని ఈ-సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ -మిగతా 2 లో



## పుర'పోరు'కు గులాబీ సైన్యం రెడీ..

- వరుసగా జిల్లాల సన్నాహక సమావేశాలు పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- నేడు ఖమ్మం, నిజామాబాద్ మీటింగ్
- పట్టణాల్లో సర్కార్ రూపాయి ఖర్చు చేయలే
- గ్రామీణ ప్రజలు కాంగ్రెస్‌ను తిరసరించారు
- అదే స్ఫూర్తితో మున్సిపోల్స్‌లో విజయ కేతనం ఎగురవేయాలని పిలుపు

**హైదరాబాద్,**
తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. 'పురపోరు'లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యం గా జిల్లాలవారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేటీఆర్ వరుసగా మున్సిపాలిటీల వారీగా నేతలతో భేటీ అవుతున్నారు. ఇప్పటికే వరంగల్, కరీంనగర్ జిల్లాల నేతలతో సమావేశమైన ఆయన.. శనివారం ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నేతలతో భేటీ కానున్నారు. హైదరాబాద్‌లో -మిగతా 2 లో



## హిమాచల్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

- 500 అడుగుల లోయలో పడిన బస్సు..
- 9 మంది మృతి

**సిర్మౌర్**
హిమాచల్‌ప్రదేశ్ సిర్మౌర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రయివేట్ బస్సు లోయలో పడి 9 మంది చనిపోయారు. 40 మందికిపైగా గాయపడ్డారు. శిమ్లా నుంచి కుప్వికి వెళ్తున్న బస్సు హరిపుర్‌ధర్ దగ్గర అదుపుతప్పి 500 అడుగుల లోయలో పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను బస్సు లోపల నుంచి బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న సహాయక సిబ్బంది గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

-మిగతా 2 లో

## ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- ఉక్రెయిన్ జరిపిన దాడికి ప్రతీకారంగానే శుక్రవారం ఈ దాడులు
- ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపైకి వందల సంఖ్యలో డ్రోన్లు దాడి
- ఉక్రెయిన్‌పై రష్యా ఒరెష్నిక్ క్షపణితో ప్రయోగం
- ధ్వని కన్నా 10 రెట్ల వేగం దాని ప్రత్యేకత

2 లో



## రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు?

- జల జగడాలు వద్దు
- తెలుగుజాతి ప్రయోజనాలే ముఖ్యం
- 2027 మార్చిలోగా 'పోలవరం' పూర్తి
- రాయవరం సభలో ఏపీ సీఎం చంద్రబాబు
- దళితులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ




**రాజమహేంద్రవరం - జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
'సముద్రంలో కలిసే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్లు వద్దొ గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదొ తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తయితే ఆ నీళ్లు తెలంగాణ కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత రాయవరం గ్రామంలో సర్వే చేసిన పంట భూములను పరిశీలించారు.

-మిగతా 2 లో

## ఆల్ఫోర్స్ స్కూల్ వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. దుర్శేడ్ వద్ద ఆల్ఫోర్స్ స్కూల్ వ్యాన్ ఢీకొనడంతో కిసాన్ నగర్‌కు చెందిన శశికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వారిని శిక్షంచాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షస్తున్నారు.

## డీజీపీకి హైకోర్టులో ఊరట

- నాలుగు వారాల్లో నియామక ప్రక్రియ పూర్తి చేయాలి -ఆదేశించిన కోర్టు
- తదుపరి విచారణ ఫిబ్రవరి 5కు వాయిదా




**హైదరాబాద్ - జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
రాష్ట్ర డీజీపీగా శివధర్ రెడ్డికి శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామకం చట్ట విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ పుల్లా కార్తీక్ ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ డీజీపీ నియామకం కోసం ప్రకాశ్ సింగ్ బాదల్ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల అమలు ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. -మిగతా 2 లో

# బొగ్గు స్కామ్‌లో అమిత్ షా!

మొదటి తరువాయి



సంబంధించి తన వద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టవలసి వస్తుందని మమత హెచ్చరించారు. ఈడీ దాడులను నిరసిస్తూ కోల్‌కతాలో శుక్రవారం జరిగిన ప్రదర్శననుద్దేశించి మమత ప్రసంగిస్తూ నా దగ్గర పెన్ డ్రైవ్‌లు ఉన్నాయి. నా పదవిపైన ఉన్న గౌరవంతో ఇప్పటివరకూ మౌనంగా ఉన్నాను. నా సహనాన్ని పరీక్షించకండి. మీ గుట్టంతా బయటపెడతా. దాన్ని చూసి యావద్దేశం షాకయిపోతుంది అంటూ అమిత్ షాను ఉద్దేశించి హెచ్చరించారు.పీఎంఎల్‌ఏ కింద దర్యాప్తు చేస్తున్న అక్రమ బొగ్గు గని కేసుకు సంబంధించి ఐ-ప్యాక్ కార్యాలయం, సంస్థ అధిపతి ప్రతీక్ జైన్ కార్యాలయంపైన గురువారం ఈడీ దాడులు నిర్వహించింది. ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో పోలీసులు, ఇతర అధికారులను వెంటపెట్టుకుని ఆ రెండు కార్యాలయాలకు వెళ్లిన మమతా బెనర్జీ కొన్ని ఫైళ్లు, పెన్ డ్రైవ్‌లతో బయటకు రావడం ఉద్రిక్తతకు దారి తీసింది. తన పార్టీకి చెందిన ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన కీలక వివరాలు ఈ ఫైళ్లలో ఉన్నట్లు మమత వెల్లడించారు.

**ఈడీపై రోడ్డెక్కిన మమత**

ఐ-ప్యాక్ కార్యాలయాలపై ఈడీ దాడులను నిరసిస్తూ శుక్రవారం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతా వీధుల్లో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సందర్భంగా ఆమె తన బలనిరూపణకు అవకాశంగా ఈ ర్యాలీని ఉపయోగించుకున్నారు. రాజకీయ కక్షసాధింపు కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నదంటూ నినాదాలు చేస్తూ 8బీ బస్టాండు నుంచి హజ్రా మోర్ వరకు మమతతోపాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారు.

# మెక్సికోపై సైనికచర్య చేపడుతాం:

మొదటి తరువాయి

ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో ప్రతి ఏటా 2.50 లక్షల నుంచి 3 లక్షల మంది మరణాలకు ఈ కార్టెల్స్ కారణమని ఆయన తెలిపారు. సముద్ర మార్గంలో డ్రగ్స్ అక్రమ రవాణాను 97 శాతం అరికట్టామని ట్రంప్ చెప్పారు. ఇక తదుపరి చర్య మెక్సికో గడ్డపై నుంచే ఉంటుందని ఆయన వెల్లడించారు.

**అమెరికా జాగీరు కాదు**

ట్రంప్ వ్యాఖ్యలపై మెక్సికో ప్రధాని క్లాడియా షీన్‌బామ్ తీవ్రంగా స్పందించారు. మెక్సికో స్వతంత్ర, సార్వభౌమ దేశమని, తమ దేశంలో ఇతరుల జోక్యాన్ని సహించే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. డ్రగ్స్ కార్టెల్స్‌ని అంతం చేసేందుకు మెక్సికోకు అమెరికన్ సైనిక బలగాలను పంపుతానని తాను పదేపదే ప్రతిపాదించినా ప్రధాని షీన్‌బామ్ తోసిపుచ్చారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ సహకరించడానికి తాము సిద్ధమేనని, అయితే విదేశీ జోక్యాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఉభయ దేశాలు ఇప్పటికే కలసి పనిచేస్తున్నాయని, అయితే మెక్సికో గడ్డపై అమెరికన్ సేనలను అనుమతించే ప్రసక్తి లేదని ఆమె తేల్చిచెప్పారు.

**డ్రగ్ మాఫియాపై వైమానిక దాడులు**

డ్రగ్స్ అక్రమ రవాణాను ఎదుర్కొనేందుకు మెక్సికోకు అమెరికా బలగాలు, నిఘా అధికారులను పంపాలని యోచిస్తున్నట్లు గత ఏడాది అక్టోబర్‌లో ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రణాళికలో అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) కూడా పాల్గొంటుందని ఎన్‌బీసీ న్యూస్ తెలిపింది. మెక్సికోలోని డ్రగ్ కార్టెల్స్‌కు వ్యతిరేకంగా ఆపరేషన్ చేపట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం పథక రచన చేస్తున్నట్లు అధికారులను ఉటంకిస్తూ ఎన్‌బీసీ న్యూస్ పేర్కొంది. ఈ మిషన్ కోసం ప్రాథమిక శిక్షణ ప్రారంభమైందని, మెక్సికో గడ్డపైన ఈ ఆపరేషన్‌లో జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్(యూఎస్‌వోసీ)కు చెందిన బృందాలు పాల్గొంటాయని తెలిపారు.

# పుర'పోరు'కు గులాబీ సైన్యం రెడీ..

మొదటి తరువాయి

జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

**కరీంనగర్.. బీఆర్ఎస్ కంచుకోట**

శుక్రవారం కరీంనగర్ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా రెండున్నర దశాబ్దాలుగా బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తూ పార్టీకి కంచుకోటలా మారిందని కొనియాడారు. ప్రతి వార్డు, డివిజన్ స్థాయిలో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని స్థానిక నేతలు కేటీఆర్‌కు వివరించారు. ప్రతి మున్సిపాలిటీని ఒక యూనిట్‌గా తీసుకొని, అకడి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు రచించాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన పట్టణ అభివృద్ధిని వివరించాలని సూచించారు. రెండేండ్ల కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలే అస్త్రాలుగా ప్రచారం చేపట్టాలని చెప్పారు. గత రెండేండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాల్లో ఒక రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గ్రామీణ ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్ పాలనను తిరసరించారని, ఇదే ధోరణి పట్టణాల్లోనూ కనిపిస్తున్నదని తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ ఘనవిజయం సాధించాలని పిలుపునిచ్చారు.

# హిమాచల్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# జల వివాదాలకు చెక్ పెడదాం

మొదటి తరువాయి

ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందన్నారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు లేదన్నారు. రాజకీయాలకతీతంగా పరిష్కారం కోసం అందరూ సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్టు ప్రకటించారు. "పక్క రాష్ట్రాలతో తెలంగాణ వివాదాలను కోరుకోవడం లేదు. న్యాయస్థానాల ముందుకు లేదా మరెవరి వద్దనో పంచాయితీ పెట్టుకునే కన్నా కూర్చొని చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి" అని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణం, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం




నుంచి రావలసిన నిధులు, అనుమతులు కూడా రావడం లేదని, తద్వారా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనా లకన్నా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం ఆలోచి స్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో కనెక్టివిటీ కోసం 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే కనెక్టివిటీతో సహా అనుమతి అడిగామని, ఆ కనెక్టివిటీని అభివృద్ధి చేయాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సహకారం అవసరం ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవు తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పరస్పర సహకారాన్ని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు.తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా అభివృద్ధి లక్ష్యలను నిర్దేశిస్తూ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని వివరించారు. ఇందులో భాగంగా సుజెన్ మెడికేర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రపంచంలో జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్‌తో పోటీ పడాలని సంకల్పించామని, అందులో భాగంగానే యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందని, బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి దేశంలో తెలంగాణ నుంచి 40 శాతం ఉందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. జర్మన్ టెక్నాలజీతో దక్షణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీలో గొప్ప సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచమే మనవైపు చూసేలా ఫార్మా రంగంలో రాణిస్తున్నామన్నారు.

# 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

మొదటి తరువాయి

సమావేశమవు తుంది, ఆ రోజున ఆర్థిక సర్వే ప్రవేశపెడతారు. మళ్లీ 31వ తేదీన ఉభయ సభలు సమావేశం కావు, ఇక ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం నాడు కేంద్ర బడ్జెట్‌ను సభకు సమర్పించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియచేసే తీర్మానంపై చర్చ, కేంద్ర బడ్జెట్‌పై చర్చ అనంతరం పార్లమెంట్ సమావేశాలు ఫిబ్రవరి 13న వాయిదా పడతాయి. తిరిగి మార్చి 9వ తేదీన పార్లమెంట్



సమావేశమవుతుంది, ఏప్రిల్ 2 గురువారం నాడు సమావేశాలు ముగుస్తాయి. సాధారణంగా 3వ తేదీ శుక్రవారం వాయిదా పడాల్సి వుంది. అయితే ఆ రోజు గుడ్‌ఫ్రైడే తర్వాత వారాంతం కావడంతో ఏప్రిల్ 2నే ముగించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో విరామం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల పద్దులను పరిశీలించడానికి శాఖాపరమైన స్థాయీ సంఘాలకు ఉపయోగపడుతుంది.

# రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు?

మొదటి తరువాయి

అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. ఎటువంటి అవినీతి అక్రమాలకూ తావులేకుండా రైతులకు రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను అందిస్తున్నామన్నారు. రీసర్వే పూర్తి అయిన 6,688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలను వరుసగా మూడోమారు ముఖ్యమంత్రిగా నిర్వహించే అదృష్టం తనకు దక్కిందన్నారు. 2027 మార్చిలోగా పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఏటా మూడు వేల టిఎంసిల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, ఇందులో 300 టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. పోలవరాన్ని ఒక యజ్ఞంగా భావించి పూర్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగిందన్నారు. గత పాలకుల తప్పిదాల వల్ల రూ.వెయ్యి కోట్లతో డయాఫ్రం వాల్ మళ్లీ కట్టాల్సి వస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో నీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారని విమర్శించారు. కృష్ణా డెల్టాలో నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలిస్తామన్నారు. కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికే రెండేళ్లు పట్టిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును పిపిపిలో కడుతుంటే ముద్దు కానీ, పిపిపి కింద మెడికల్ కాలేజీలు కడితే వద్దంటున్నారని విమర్శించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దేశంలోకొచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని పేర్కొన్నారు. త్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంతలు లేని రహదారులను తయారు చేస్తున్నామని, రెండు రోజుల్లోనే 40 కిలోమీటర్ల రోడ్డు వేసి రికార్డు సృష్టించామని తెలిపారు.

# ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- ఉక్రెయిన్ జరిపిన దాడికి ప్రతీకారంగానే శుక్రవారం ఈ దాడులు
- ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపైకి వందల సంఖ్యలో డ్రోన్లు దాడి
- ఉక్రెయిన్‌పై రష్యా ఒరెష్నిక్ క్షపణితో ప్రయోగం
- ధ్వని కన్నా 10 రెట్ల వేగం దాని ప్రత్యేకత



**కీవ్,జనవరి 9**

ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి క్షపణులతో విరుచుకుపడింది. ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ జరిపిన దాడికి ప్రతీకారంగానే శుక్రవారం ఈ దాడులు జరిగినట్టు తెలుస్తున్నది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపైకి వందల సంఖ్యలో డ్రోన్లు, డజన్ల కొద్దీ క్షపణులు దూసుకొచ్చినట్టు అధికారులు వెల్లడించారు. రష్యా తమపైకి 13 ఖండాంతర క్షపణులు, 22 క్రూయిజ్ మిస్సైళ్లు, 242 డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు. ముఖ్యంగా ఒరెష్నిక్ మిస్సైల్‌ను రష్యా ప్రయోగించినట్టు పేర్కొన్నారు. ఒరెష్నిక్ మిస్సైల్ ధ్వని కన్నా పది రెట్ల అధిక వేగంతో గంటకు 13 వేల కిలోమీటర్ల స్పీడ్‌తో ప్రయాణిస్తుంది .యూరప్‌లోని దాదాపు అన్ని దేశాలపైకి ఈ మిస్సైల్‌ను ప్రయోగించేలా రష్యా దీన్ని డిజైన్ చేసింది. ఈ క్షపణిని దాని వేగం కారణంగా ఎవరూ అడ్డుకోలేరని పుతిన్ ఇటీవల వెల్లడించారు. ఇది అణ్వాయుధంతో సరిసమానమైనదని అన్నారు.రష్యా దాడిలో నలుగురు మరణించగా, 25 మంది వరకు గాయపడ్డారు.

# డీజీపీకి హైకోర్టులో ఊరట

మొదటి తరువాయి

డీజీపీగా బి.శివధర్‌రెడ్డి నియామకం చెల్లదని పేర్కొంటూ సోషల్ వర్కర్ టి.ధన్‌గోపాల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేశారు. డీజీపీ నియామకంపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలనీ, హైకోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం పంపిందని అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి వివరించారు. డిసెంబరు 31న తాజాగా మరో జాబితాను పంపామనీ, అయితే ఆలస్యమైందని చెప్పి దానిని యూపీపీఎస్సీ వెనక్కి పంపిందని అన్నారు. కోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం, యూపీపీఎస్సీ విధిగా అమలు చేయాలన్నారు. గతంలో యూపీపీఎస్సీ రాష్ట్రానికి నాలుగు లేఖలు రాస్తే వాటిలో జాప్యం ప్రస్తావనే లేదన్నారు. ఏపీ ప్రభుత్వం 11 ఏండ్ల తర్వాత జాబితాను పంపితే యూపీపీఎస్సీ ఆమోదిం చిందని గుర్తుచేశారు. పిటిషనర్ అడ్వొకేట్ వాదిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం యూపీపీ ఎస్సీకి ఆలస్యంగా జాబితా పంపడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు.

# 66 అంతర్జాతీయ సంస్థలకు అమెరికా గుడ్‌బై



**వాషింగ్టన్ జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**

: అరవై ఆరు అంతర్జాతీయ సంస్థల నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా ప్రకటించింది. వీటిలో ఐక్యరాజ్యసమితి జనాభా ఏజెన్సీ, అంతర్జాతీయ వాతావరణ సంప్రదింపుల కోసం ఉద్దేశించిన ఐరాస ఒప్పందం ఉన్నాయి. సంస్థలు, ఏజెన్సీలు, కమిషన్లకు అమెరికా మద్దతును ఉపసంహరిస్తూ అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వీటిలో ఐక్యరాజ్యసమితికి చెందినవి కూడా ఉండడం గమనార్హం. ఈ అంతర్జాతీయ సంస్థలన్నీ నిరుపయోగమైనవని, సమర్థవంతంగా పనిచేయడం లేదని, ప్రమాదకరమైనవని ట్రంప్ ప్రభుత్వం తన సమీక్షలో పేర్కొంది. మరికొన్ని అంతర్జాతీయ సంస్థలపై సమీక్ష కొనసాగుతోంది. ఈ సంస్థల నిర్వహణ సరిగా లేదని, అవి కొందరి వ్యక్తిగత అజెండాల కోసం పనిచేస్తున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. ఈ సంస్థలు అమెరికా సార్వభౌమత్వానికి, స్వేచ్ఛకు, సౌభాగ్యానికి ముప్పుగా పరిణమించాయని ఆరోపించారు. ఇలాంటి సంస్థలకు అమెరికా పన్ను చెల్లింపుదారుల సొమ్మును ధారాదత్తం చేయడం తనకు ఇష్టం లేదని ట్రంప్ స్పష్టం చేశారని తెలిపారు. కాగా వాతావరణం, కార్మికులు, వలసలు, ఇతర అంశాలపై దృష్టి సారిస్తున్న పలు ఐరాస ఏజెన్సీలు, కమిషన్లకు ట్రంప్ నిధులు ఆపేశారు. పార్టనర్‌షిప్ ఫర్ అట్లాంటిక్ కో-ఆపరేషన్, ది ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రసీ అండ్ ఎలక్టొరల్ అసిస్టెన్స్, గ్లోబల్ కౌంటర్ టెర్రరిజం ఫోరం వంటి ఐరాస యేతర సంస్థలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

## 16 లయన్స్ క్లబ్స్ మరియు నల్లగొండ
# లయన్స్ ఫ్రీ ఆధ్వర్యంలో అన్నవితరణ

**నల్లగొండ ,జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జనవరి 3నుండి 11వ తేదీ వరకు జరుగుతున్న అంతర్జాతీయ హంగర్ సర్వీస్ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణం లోని 16 లయన్స్ క్లబ్స్ మరియు నల్లగొండ లయన్స్ ఫ్రీ మీల్స్ ఫౌండేషన్ (ట్రస్ట్) ద్వారా ఈ రోజు నల్లగొండ పట్టణం లోని క్లాక్ టవర్ సెంటర్ లో నల్లగొండ పట్టణ మునిసిపల్ కార్మికులు, ఆటో డ్రైవర్లు, హమాలీ కార్మికులు, రోజు వారి కూలీలు వీధి అమ్మకం దారులు సుమారుగా 800 మందికి అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా డిస్ట్రిక్ట్ 320జు జిల్లా గవర్నర్ లయన్ మదన్ మోహన్ రేపాల గారు, లయన్ లేడీ విజయలక్ష్మ రేపాల గారు ప్రారంభించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ మున్సిపల్ చైర్ మ్యాన్ శ్రీ బుర్రి శ్రీనివాస్ రెడ్డి గారు, తెలంగాణ జిల్లాల సర్వీస్ కోఆర్డినేటర్ లయన్ మోహన్ రావు తీగల గారు , జిల్లా రెండవ ఉప గవర్నర్ గారు, జిల్లా హంగర్ సర్వీస్ కోఆర్డినేటర్ లయన్ దశరథ జెల్ల గారు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ రామకృష్ణ చిలుకూరి, డిస్ట్రిక్ట్ సర్వీస్ కోఆర్డినేటర్



లయన్ రవీందర్ రావు బాచుపల్లి గారు, డిస్ట్రిక్ట్ మహిళా సంక్షమ కోఆర్డినేటర్ లయన్ పద్మ ప్రసాద్ మామిడి గారు, జిల్లా క్లబ్స్ ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ లయన్ మురళీధర్ రెడ్డి తుమ్మలూరి గారు, జిల్లా జాయింట్ ట్రెజరర్ లయన్ సంజీవ రెడ్డి తేలుకుంట్ల గారు, డిస్ట్రిక్ట్ ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ లయన్ అంజి రెడ్డి ఏడుళ్ల గారు మిరియాల యాదగిరి, కోడె సతీష్ కుమార్, పుట్ట వెంకన్న, ఎర్ర మాదా అశోక్, జిల్లా జోన్ చైర్ పర్సన్ లు, రీజియన్ చైర్ పర్సన్ లు, జిల్లా క్యాబినెట్ మెంబర్లు, లయన్స్ క్లబ్స్ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులు, నల్లగొండ పట్టణం లోని లయన్ సభ్యులు పాల్గొని చక్కటి సేవలు అందించారు.

# విపస్య స్కూల్లో ఘనంగా సంక్రాంతి వేడుకలు



**నల్లగొండ, జనవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** చర్లపల్లి లోని విపస్య స్కూల్లో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు భోగి పండ్లు పోసీ, భోగి మంటలు వేసి పతంగులను ఎగురవేశారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ బండారు ప్రసాద్, డైరెక్టర్లు ఎదుపాటి అంజమ్మ, ఓరుగంటి భాగ్యలక్ష్మ, ప్రిన్సిపల్ శ్రీకాంత్ లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిబ్బంది గోపి, రమా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీతారామచంద్రస్వామి ఆలయంలో ఘనంగా గరుడసేవ కార్యక్రమం

**నల్లగొండ, జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రామగిరి లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గరుడసేవ ఘనంగా నిర్వహించారు. మంగళ శాసన పాశురాం సందర్భంగా పద్మావతి కోలాట బృందం, నాట్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ డాన్స్ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. అనంతరం రామచంద్ర జీయర్ స్వామి, బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, చకిలం వేణుగోపాలరావు,



చకిలం సంధ్యారాణి, వికాస తరంగిణి సభ్యులు ఈశ్వర్ రెడ్డి, సుజాత, రాజేష్, భారతమ్మ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ధనురాస ఉత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ రోడ్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి సన్నిధిలో దీపోత్సవం ఘనంగా నిర్వహించారు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి ఆలయాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు భరతాచార్యులు, శేషాచార్యులు, భక్తులు ఇందిరా, జయమ్మ, భాగ్యమ్మ, నాగమణి, అనసూయ, నిర్మల, కవిత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# దమ్మక్కపల్లి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు



**మనోహరబాద్, జనవరి 9(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎంపీపీఎస్ దమ్మక్కపల్లి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పండుగ వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. సెలవు రోజుల్లో పతంగులు ఎగరేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల ఆవరణలో విద్యార్థులు వేసిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. రంగుల హరివిల్లుల్లా మెరిసిన ఈ ముగ్గులు పండుగ వాతావరణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. విద్యార్థుల చేత పతంగుల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించబడ్డాయి. చిన్నారుల ప్రతిభను వెలికితీసిన ఈ పోటీలు ఉత్సాహభరిత క్షణాలను సృష్టించాయి.ప్రతి పండుగ సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సంస్కృతీ విలువలు, సామాజిక చైతన్యం పెంపొందించడం పాఠశాల లక్ష్యమని ఉపాధ్యాయులు తెలిపారు. పండుగ ఉత్సవాలు విద్యార్థులలో సృజనాత్మకతను, పోటీ భావనను, సంస్కృతీ విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

# డిమాండ్ల సాధనకై ఉపాధ్యాయుల గళం

**-చెరుకుపల్లి జెడ్పీహెచ్ఎస్ లో నల్ల బ్యాడ్జీలతో నిరసన**



**దేవరకొండ,జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గుండ్లపల్లి మండలంలోని చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. జాతీయ ఉపాధ్యాయ సంఘాల (ఏ ఐ జేఏసిటిఓ) పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సీపీఎస్ విధానం ఉపాధ్యాయుల భవిష్యత్తుకు భద్రత లేనిదని, దానిని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, ఇప్పటికే విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతుల కోసం టెట్ నిబంధనను తొలగించాలని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కల్పించాలని వారు కోరారు.పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉత్సాహంగా పాల్గొన్న ఈ నిరసనలో, తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# చెరుకుపల్లి హైస్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**దేవరకొండ జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా గుండ్లపల్లి మండలంలోని చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సంబరాలు



ముందస్తుగా మిన్నంటాయి. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించగా, రంగురంగుల ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, పాఠశాల ఆవరణను ముగ్గులతో, గొబ్బెమ్మలతో అలంకరించారు. విద్యార్థినులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ వేసిన ముగ్గులు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్యా నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని కొనియాడారు. సంక్రాంతి ఒక ప్రత్యేకమైన పండుగ అని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో ముందస్తుగా పండుగ వాతావరణాన్ని నెలకొల్పి విద్యార్థులకు పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు భూక్య నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు లింగయ్య, లక్ష్మి సుజాత, శ్రీనివాస్, శ్రీనయ్య, శోభన్ బాబు, వాసవి, పుష్పలతతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకానందుడి మాట ఏబీవీపీ బాట

**-హనుమాన్**



**దేవరకొండ జనవరి 09. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి పురస్కరించుకొని స్థానిక కళాశాలలో సెమినార్ నిర్వహించడం జరిగింది.కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు హనుమాన్ మాట్లాడుతూ.నేటి యువతకు స్వామి వివేకానంద ఆలోచనలు,సేవ భావం,దేశభక్తి,ఆత్మవిశ్వాసం, ధర్మం,జ్ఞానం ఇవే నూతన భారత నిర్మాణానికి అవసరమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కో–కన్వీనర్ యలమల గోపి,విద్యార్థి నాయకులు రాకేష్,కైలాష్,రాజేష్,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ




**ఫరూక్‌నగర్, జనవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఫరూక్‌నగర్ ఉన్నత పాఠశాలలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మొత్తం 25,000 నోట్‌బుక్స్‌ను షాద్‌నగర్ ఆర్యవైశ్య వ్యాపారస్తుల ఆర్థిక సాయంతో పంపిణీ చేస్తున్నామని తెలిపారు."మేము కూడా ఇదే పాఠశాలలో చదివాం. ఈ విధంగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది" అని గందె సురేష్ పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడే ఈ కార్యక్రమం సమాజానికి ఉపయోగకరమని ఆయన అన్నారు.ఈ సందర్భంగా బుక్స్ కమిటీకి ఆర్థిక సహకారం అందించిన నాగిళ్ల భవాని ప్రసాద్, ఫరూక్‌నగర్ మండలాధ్యక్షులు, బుక్స్ కమిటీ చైర్మన్ ఎల్కుర్తి నారాయణ, కో–కన్వీనర్ మరియు మండల మాజీ అధ్యక్షులు అనుమారి మురళీధర్, సామాజిక కార్యకర్త, యువజన సంఘం కోశాధికారి నీల రవీందర్, మండల కోశాధికారి యశ్వంత్ రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. రాజశేఖర్ రెడ్డి, పూర్వ విద్యార్థి మిట్ట రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ లో ఘనంగా సంక్రాంతి సంబరాలు













## నీలగిరి ఎక్స్ ప్రెస్ దినపత్రిక ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, బహుమతుల ప్రధానం

**నల్గొండ ,జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తిప్పర్తి మండల కేంద్రంలో ని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల నందు శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నీలగిరి ఎక్స్ ప్రెస్ దినపత్రిక ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు సీనియర్ విభాగంలో జి లాస్య అండ్ టీం టెన్త్ క్లాస్, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సిఇసి రక్షితాదేవి అండ్ టీం ద్వితీయ సంవత్సరం బైపిసి జనని టీం, జూనియర్ విభాగంలో అక్షయ, రమ్యశ్రీ ఆరవ తరగతి ద్వితీయ బహుమతి 9వ తరగతి విద్యార్థులు కన్సోలేషన్ బహుమతిగా పదవ తరగతి బాలురు లకు బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారికి ప్రిన్సిపాల్ ఏ అపర్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# వీబీ-జీ రామ్ జీ చట్టంతోనే కార్మికులకు రక్షణ




**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్‌లో బూత్ నిర్మాణ అభియాన్ జిల్లా కార్యశాల కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరవెల్లి రఘునాథ్ మాట్లాడుతూ 'వీబీ-జీ రామ్ జీ చట్టం కనీస వేతనాలకు పూర్తి రక్షణ కల్పిస్తుందని, పాత ఎంజీఎన్‌ఆర్జీఏ చట్టాన్ని నీరుగార్చడం కాదని స్పష్టం చేశారు. మెరుగైన ఫలితాల కోసం ప్రధాని మోదీ నాయకత్వంలో తీసుకున్న దిద్దుబాటు చర్యగా దీనిని అభివర్ణించారు.ఇప్పటివరకు 100 రోజులు పని కల్పించగా, కొత్త చట్టం ద్వారా 125 రోజులకు ఉపాధి హామీ లభిస్తుందని, నిరుద్యోగ భత్యం నిబంధన మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. పథకాల రూపకల్పన గ్రామపంచాయతీల ఆధ్వర్యంలోనే జరుగుతుందని, కనీసం 50 శాతం పనులు నేరుగా గ్రామస్థాయిలో అమలవుతాయని చెప్పారు.ఓటర్ల జాబితా ప్రక్షళన (ఎస్ఐఆర్) దేశంలో నిత్యం జరిగే ప్రక్రియ అని, దీనిపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అనవసరమని రఘునాథ్ పేర్కొన్నారు. ప్రజలకు మేలు జరిగే అంశాలపై ప్రతిపక్షలు తప్పుదారి పట్టించడం సిగ్గుచేటని అన్నారు.త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి శక్తిని చాటిచెప్పాలని, పోలింగ్ బూత్ బాధ్యులు సమన్వయంతో పని చేసి కాషాయ జెండా ఎగరేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# జెమ్స్ మోడల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు




**పాలకుర్తి, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈశాల తక్కల్లపల్లి గ్రామంలోని జెమ్స్ మోడల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.స్కూల్ కరస్పాండెంట్ జాలపల్లి మహేష్ విద్యార్థులకు సంక్రాంతి పండుగ గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ హరిదాసు వేషధారణలో పాటలు పాడుతూ భోగి మంటలు వెలిగించారు. విద్యార్థినులు వేసిన రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో చేసిన పూజలు ఆకట్టుకున్నాయి. తరువాత పతంగులు ఎగరేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో హెచ్ఎం జాలపల్లి స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తజికిస్తాన్‌లో 5.3 తీవ్రతతో భూకంపం



**దుషాంబే (తజికిస్తాన్)- జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తజికిస్తాన్‌లో శుక్రవారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 5.3గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. భూకంపం శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తజికిస్తాన్‌లో సంభవించింది. వెడల్పు : 38.26, పొడవు : 73.42, 110 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు ఎన్‌సిఎస్ ఎక్స్ పోస్టులో పేర్కొంది.

# ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలికితీయడంసంతోషకరం

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**






**దేవరకొండ జనవరి 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో యువ నాయకులు నేనావత్ అభిలాష్ నాయక్ సౌజన్యంతో నిర్వహిస్తున్న దేవరకొండ డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ - 2026 ను ఎమ్మెల్యే బాలు నాయక్,ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు. క్రీడలు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని ఆయన సూచించారు.క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని సానుకూల దృక్పథంతో స్వీకరించాలన్నారు.తమ ప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు త్వరలో దేవరకొండలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతో పాటు క్రీడా రంగ అభివృద్ధిపై విధివిధానాలను రూపొందించనున్నట్లు తెలిపారు.దేవరకొండ క్రీడల అభివృద్ధి కోసం చర్యలు చేపడతామని వెల్లడించారు. దేవరకొండ నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో మినీ స్టేడియాల నిర్మాణంపై యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, నియోజక వర్గ ముఖ్య నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ శిరీష




**షాద్‌నగర్, జనవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షాద్‌నగర్ తొలి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ)గా సీహెచ్ శిరీష శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నందిగామ పోలీస్‌స్టేషన్ పై అంతస్తులో ప్రత్యేకంగా డీసీపీ కార్యాలయం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్‌కుమార్, కొత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ నర్సయ్య, కేశంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, నందిగామ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, షాద్‌నగర్ రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సుశీల, శ్రీకాంత్, రవీందర్ నాయక్, విజయ్‌కుమార్ తదితర పోలీస్ సిబ్బంది డీసీపీకి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ వ్యవస్థలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన ఈ సందర్భం, స్థానిక ప్రజల్లోనూ, పోలీస్ సిబ్బందిలోనూ ఉత్సాహాన్ని నింపింది. కొత్తగా ఏర్పాటైన డీసీపీ కార్యాలయం ద్వారా శాంతి భద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కమిషనర్



**ఆమనగల్లు, జనవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో ప్రభుత్వం విడుదల చేసిన టి యు ఎఫ్ ఐ డి సి నిధుల ద్వారా చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ప్రారంభించారు. మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే కమిషనర్ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కమిషనర్ శంకర్ నాయక్, మాజీ సర్పంచి గుర్రం కేశవులు, సత్యం, వెంకటేష్, శీను, అబ్దుల్ అలీం, నాజర్, మహేష్, కుమార్ గౌడ్, గణేష్,కిరణ్, సంధ్యారాణి,గౌస్, వెంకటమ్మ,లక్ష్మమ్మ, బాలమ్మ,కమలమ్మ, బుజ్జి,వసంత, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో నూతన ఉత్తేజం

**- కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్**



**కడ్తాల్, జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
కడ్తాల్ మండలంలోని సలార్పూర్ ,రేఖ్య తండాలో స్థానిక సర్పంచులు ప్రియా రమేష్ నాయక్,లక్ష్మిబాయితో కలిసి క్రికెట్ టోర్నమెంట్ ను కడ్తాల్ మాజీ జడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ప్రారంభించారు. క్రీడాకారులతో పరిచయం చేసుకొని టాస్ వేయడం జరిగింది. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సరదాగా బ్యాటింగ్ చేసిన ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని తద్వారా యువత ఆరోగ్యంగా ఉండగలుగుతారని యువత క్రీడలపై దృష్టి సరించాలన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇటువంటి టోర్నమెంట్ ఎంతో దోహదపడతాయని క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా పెరుగుతుందని ఆయన అన్నారు. క్రీడల్లో యువత రాణించి రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేశ్వరి,కుమార్, దేవ్ నాయక్ ,మాజీ ఎంపీపీ సువాలి పంతు నాయక్,మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, వార్డు సభ్యులు జైపాల్, మల్లేష్,రమేష్,శ్రీశైలం, నాయకులు హనుమంతు, కోటియా, క్రీడాకారులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# వివేక విద్యా భారతిలో ముందస్తు సంక్రాంతి సంబరాలు





**ఆమనగల్లు, జనవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణంలోని వివేక విద్యా భారతి పాఠశాలలో శుక్రవారం రోజు ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల గౌరవాధ్యక్షులు డాక్టర్ పుల్లయ్య, ప్రముఖ సంఘ సేవకుడు ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై, పాఠశాల ఆవరణలో విద్యార్థులు అలంకరించిన రంగవల్లులను పరిశీలించి,భోగి మంటల ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రంగుల పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తూ, విద్యార్థులను ఉద్దేశించి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పుల్లయ్య మాట్లాడుతూ... సంక్రాంతి రైతుల పండుగని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్, ఉపాధ్యాయులు అజ్రా, మల్లేష్, స్వప్న,అరుణ, షమీం, రత్నకుమారి, నజీర్, మీన,స్వాతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ రెడియల్ రోడ్డు సర్వేను నిలిపివేయాలి

**-కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్**



**కడ్తాల్, జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలంలో గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు సర్వేను, భూసేకరణ తక్షణమే నిలిపివేయాలి కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం పునరావాసం కల్పించే వరకు బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న రైతులు భూనిర్వసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి సరైన పరిహారం అందడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని లేనియెడల రైతుల పట్ల నిలిచి భూములు కోల్పోతున్న రైతన్నల కోసం నిరాహార దీక్ష కైనా వెనకాడనని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల తమ ప్రాంతంలో సామాన్య ప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతన్నలు రోడ్డున పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భూ సేకరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సామాన్య ప్రజలను హడలెత్తించిన రేవంత్ సర్కార్ శివారు ప్రాంతంలో భూసేకరణ పేరిట రైతులను వెంటాడుతున్నారని ఒకవైపు ఫార్మా భూములు రైతులు కొన్ని నెలలుగా ఇల్లు వాకిలి వదిలి ఆందోళనబాట పట్టారని తాజాగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు బాధిత రైతులు సైతం రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చిందని కెసిఆర్ ప్రభుత్వ హయాంలోని వంద అడుగులతో విశాల రహదారులు ఉన్నప్పటికీ ప్రధానంగా ఆర్ఆర్ నుండి ట్రిబుల్ ఆర్ వరకు ఏకంగా 330 ఫీట్ల గ్రీన్ ఫీల్డ్ నిర్మాణానికి ప్రభుత్వం ఉరకలు పరుగులు పెడుతుందన్నారు. రహదారి నిర్మాణానికి భూములు ఇస్తున్న రైతుల డిమాండ్లను వెంటనే పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరి వివరిస్తుందని రైతులు హైకోర్టును ఆశ్రమించి తమ భూముల్లో రోడ్డు స్టే తెచ్చుకున్న ప్రభుత్వం అవేవీ పట్టించుకోకుండా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిందని రేపు మాకు నిర్మాణ పనులు కూడా మొదలుకాన్నాయని రైతులకు పూర్తి న్యాయం చేయకుండా పనులు మొదలు పెడితే రైతులకు అండగా ఉండి రైతుల కోసం నిరాహార దీక్ష చేయడానికి వెనుకాడనని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీను నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మినరసింహారెడ్డి, మాజీ డైరెక్టర్ జోగు వీరయ్య, కడ్తాల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ,మాజీ ఉపసర్పంచ్ ముత్యాలు, నాయకులు రాఘవరెడ్డి, జంగయ్య, శంకరయ్య, శంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,మల్లయ్య, బిక్షపతి,శివ, చంద్రయ్య, వెంకటయ్య, యాదయ్య, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ



**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను శుక్రవారం ఆర్డిఓ కే. మహేశ్వర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంలను తనిఖీ చేసి సమగ్ర నివేదిక పంపుతున్నామని తెలిపారు. ఈవీఎంల రక్షణ, భద్రతా ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరును పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిప్యాట్ గదుల ఏర్పాట్లను కూడా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కే. రాం రెడ్డి, బిజెపి పార్టీ ప్రతినిధి దేవి శెట్టి నవీన్ కుమార్, ఎంఐఎం పార్టీ ప్రతినిధి బర్కత్ అలీ, సిపిఎం పార్టీ ప్రతినిధి డి. నరేష్ పటేల్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే



**ఆమనగల్లు, జనవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగలు పట్టణంలో 13వ వార్డు కమల నగర్ కాలనీలో ఉన్న డంపింగ్ యార్డు కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే పరిశీలించారు. డంపింగ్ యార్డ్ తో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, దుర్వాసనతో దుర్గంధం వస్తూ, చెత్తను కాల్చిన పొగతో మహిళలు వృద్ధులు పిల్లలు, అనారోగ్యానికి గురవుతన్నారని ఎమ్మెల్యే ముందు కాలనీవాసులు వాపోయారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను వెంటనే తీరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధన కోసం నిరసన




**కడ్తాల్, జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** : కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆల్ ఇండియా ఐక్య సంఘాల కార్యచరణ సమితి పిలుపు మేరకు నిరసన చేపట్టారు. ఆగస్టు 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు. సిపి ఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించడం. ఎన్ఈపీ -2020 ని రద్దు చేయడం. పై ముఖ్యమైన డిమాండ్ల సాధన కోసం పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన కార్యక్రమము చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ కె. సుజాత నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యూటీ ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, మండల ఉపాధ్యక్షులు మల్లయ్య, కోశాధికారి నరసింహమూర్తి, మండల నాయకులు డి పాండు, ఆర్.రవి,భాగ్యలక్ష్మి,భీముడు, రాజు,జంగయ్య ఉపాధ్యాయులు, ఎంపిడిఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నందుపల్లి గ్రామంలో ప్రతినెల 2వ శుక్రవారం గ్రామ సందర్శన



**మహేశ్వరం జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని నందుపల్లి గ్రామంలో ప్రతినెల రెండవ శుక్రవారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దేశపగ నరసింహ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.ప్రతి ఇంట్లో నీటి సరఫరా సక్రమంగా జరుగుతోందా, డ్రైనేజీలు, కరెంటు సమస్యలు వంటి అంశాలను పరిశీలించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్యక్రమంలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్పంచ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ షేక్ ఎజాస్, వార్డు సభ్యులు దేశపగ లింగీ సంతు, హసీన, రంగుల యాదమ్మ, కల్వకోల్ మహేందర్, దేశపగ రమేష్, ఆకన్‌పల్లి శ్రావణి, కర్రె సునీత, పంచాయతీ కార్యదర్శి జానయ్య, ఉప కార్యదర్శి హేమలత, అంగన్వాడి టీచర్లు, స్కూల్ టీచర్లు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి ఇరుముడి పూజా మహోత్సవం



**బాలాపూర్ జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ మీర్పేట్ సర్కిల్ పరిధిలోని జిల్లెలగూడ డివిజన్‌లో అయ్యప్ప స్వామి ఇరుముడి పూజా మహోత్సవం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించబడింది. భక్తుల సందడి మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ మహోత్సవానికి రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలను ఒక్కటిగా కలిపి ధార్మిక విలువలను కాపాడుతాయని ఆయన పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ పూజా మహోత్సవంలో బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, తులసి ముఖేష్ ముదిరాజ్, మాజీ బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెండ్యాల నరసింహ, బిజెపి నాయకులు తిరుపతి రెడ్డి, రవి నాయక్, సిద్ధల శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, వీరకర్ణ రెడ్డి, జిల్లా బీజేవైఎం నాయకులు రాఘవేందర్ ముదిరాజ్, మనీష్ ముదిరాజ్, జెడి పవన్, అయ్యప్ప మాలధారులు, స్థానిక నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఈనెల 17 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

**- ఎంపీడీవో భాస్కర్‌రావు**

**ఎలిగేడు,జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీఎం కప్--2025-26 కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుండి 22 వరకు గ్రామపంచాయతీ పరిధిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు.ఈ పోటీల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగ విభాగాల్లో పోటీలు జరగనున్నాయని ఆయన పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనదలచుకున్న వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ముందస్తు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయని వారికి అర్హత ఉండదని స్పష్టం చేశారు.క్రీడాకారులు తమ మొబైల్ ఫోన్ ద్వారా సీఎం కప్--2025 అధికారిక వెబ్‌సైట్‌లో గానీ, లేదా మీసేవ కేంద్రాలు/ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఫోటో, ఆధార్ కార్డు నెంబర్, వయస్సు ఆధార పత్రం తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు.గ్రామస్థాయిలోని క్రీడాకారులకు ఈ విషయాన్ని విస్తృతంగా తెలియజేసి, రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎలిగేడు మండలంలోని అన్ని గ్రామపంచాయతీ సెక్రటరీలకు, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు వెల్లడించారు.

# మాజీ ఎమ్మెల్యే నోముల నరసింహయ్యకు నివాళులు



**మిర్యాలగూడ,జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే, బడుగు బలహీన వర్గాల గొంతుకగా నిలిచిన దివంగత నేత కీ.శే. నోముల నరసింహయ్య 70వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు.ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన జనహృదయనేత నోముల నరసింహయ్య ఎప్పుడూ పేదప్రజల కోసమే పోరాటం చేసి, అణగారిన వర్గాల ఆశాదీపంగా నిలిచారని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు గుర్తుచేశారు. ఆయన సేవలు, త్యాగాలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవాధ్యక్షులు చింతలచెరువు లింగయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి చేగొండి మురళీ యాదవ్, గౌరవ సలహాదారు పెద్ద బోయిన వెంకటేశ్వర్లు యాదవ్, వేములపల్లి సర్పంచ్ పుట్టల సందీప్, మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్య యాదవ్, రాంబాబు, వినయ్, వెంకన్న, శ్రీనివాస్, కిషోర్, సురేష్, కిరణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.నోముల నరసింహయ్య జయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలో ప్రజా సేవ కొనసాగించాలని పాల్గొన్న నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

# జాతీయ భవన నిర్మాణ కార్మిక సేవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**అబ్దుల్లాపూర్ మెట్,జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ పాల్గొనగా, మండల తాజా మాజీ ఎంపీపీ బుర్ర రేఖ మహేందర్ గౌడ్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించబడింది. ఈ సందర్భంగా కార్మికుల సంక్షమం కోసం సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు దండుగుల రాజ, అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షుడు గుండె రంగయ్య, మాజీ ఎంపీటీసీ తాటిపల్లి నవ్య, వార్డు సభ్యుడు రమేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



**కడ్తాల్,జనవరి 09 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాల్లో రంగవల్లులతో అందంగా ముగ్గులు వేసి ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

# సర్పంచ్ ల సదస్సుకు తరలిరావాలి

**-సర్పంచ్ బొప్పిడి గోపాల్**



**కడ్తాల్, జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** సర్పంచుల సంఘం చైతన్య సదస్సును విజయవంతం చేయాలని సర్పంచ్ బొప్పిడి గోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్ స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 10న జెడ్పీ కార్యాలయం వద్ద పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాల సర్పంచ్లతో సర్పంచ్ ల సంఘం జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతనంగా గెలుపొందిన సర్పంచ్ లు అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన రోడ్లు, డ్రైనేజీలు, పంచాయతీ భవనాలు అంగన్ వాడీ భవనాలు, కుల సంఘాల భవనాలు, విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు పవన్ కుమార్, నాయకులు శేఖర్, ముబీన్, నరసింహ, సాయికుమార్ తదితరులున్నారు.

# గ్రామ అభివృద్ధికి కృషి

**సర్పంచి నర్సింహా గౌడ్**



**కడ్తాల్, జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రామ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తున్నట్లు సర్పంచి లక్ష్మదేవి నర్సింహా గౌడ్ అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో పంచాయితీ పాలకవర్గం ఆధ్వర్యంలో 50స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు నింగ్యారి యాదగిరి, శ్రీకాంత్, నాయకులు జంగయ్య, కృష్ణ,అంజమ్మ, లక్ష్మయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

# పశు సంపాదను కాపాడుకోవాలి



**కడ్తాల్, జనవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి గ్రామంలో తెలంగాణ పశు గణన అభివృద్ధి సంస్థ సహకారంతో సర్పంచ్ పాలకుర్ల కరుణాకర్ గౌడ్ , మర్రిపల్లి సర్పంచ్ రవి,డాక్టర్ భాను నాయక్ తో కలిసి సంతానోత్పత్తి శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో 13 జంతువులు గర్భిణీగా ఉన్నట్లు కనుగొనబడ్డాయి, 4 జంతువులకు కృత్రిమ గర్భధారణ జరిగింది. 30 దూడలకు నులిపురుగుల నివారణ పూర్తి చేశారు.ఈ శిబిరంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సూపర్‌వైజర్ లక్ష్మయ్య, వెంకటయ్య జెవిఓ, పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

-కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి జనవరి 09 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
శుక్రవారం వనపర్తి పట్టణం మర్రికుంటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, మంచి నూనే, కూరగాయల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ వచ్చినప్పుడు విద్యార్థులకు ఆహార పదార్థాల నాణ్యత, గడువు పరిలనకు పెట్టీ రిజిస్టరులో విద్యార్థుల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. వంటగదిని పరిశీలించిన కలెక్టర్ భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యాలయాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, పాఠశాల ఉపాధ్యాయులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అందరం ఐక్యంగా పని చేద్దాం

- ఎమ్మెల్యే మెగా రెడ్డి-



**వనపర్తి జనవరి 09( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
కాంగ్రెస్ పార్టీలో పాత-కొత్త అనే తేడా లేకుండా అందరం ఐక్యంగా పనిచేసి పార్టీని మరింత పటిష్టం చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్ శివసేన రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని ఆర్‌జీ గార్డెన్స్‌లో నిర్వహించిన మున్సిపాలిటీ 33 వార్డుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండానే అజెండాగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వంటి అనేక సంక్షమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వనపర్తి పట్టణంలో ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పార్టీ బీ-ఫారం పొందిన అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని, వర్గపోరులకు తావివ్వొద్దని వారు సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నక్కర్త--మేడిపల్లి ప్రజా సేవలో 9వ వార్డు సభ్యులు ఆలంపల్లి మహేష్





**యాచారం,జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నక్కర్త--మేడిపల్లి గ్రామంలోని 9వ వార్డులో నూతనంగా శాంక్షన్ అయిన సీసీ రోడ్డు పనులను వార్డు సభ్యులు ఆలంపల్లి మహేష్, మాజీ ఎంపీటీసీ ముంత జంగయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లతో ప్రజలకు మహార్దశ రానుందని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని పనులను వేగంగా పూర్తి చేయాలని, విధిగా నిబంధనల ప్రకారం నిర్మాణం జరగాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయని వారు తెలిపారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి దిశగా చేపట్టిన ఈ చర్య ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించిందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# 18న ఖమ్మంలో జరగబోయే సిపిఐ బహిరంగ సభ విజయవంతం చేయండి

**మహేశ్వరం జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో సిపిఐ ప్రచార జాత ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రచార యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, జనవరి 18న ఖమ్మంలో జరగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జంగయ్య మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపన తర్వాత రాజరిక వ్యవస్థలకు, భూస్వామ్య పెత్తందారుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం సంస్థానాన్ని




ప్రజాస్వామ్య పరిపాలన వైపు నడిపిన వీరులు కమ్యూనిస్టులేనని ఆయన పేర్కొన్నారు. "బాంచను దొర నీ కాళ్లు మొక్కుతా" అనే కాలం నుండి తలెత్తుకొని తిరిగే కాలం వైపు సమాజం నడిపిన శక్తి కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితమే" అని ఆయన అన్నారు. జాతీయ ఉద్యమంలో సంపూర్ణ స్వాతంత్రం కోసం, దేశవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ నాయకత్వం వహించిందని జంగయ్య వివరించారు. మహేశ్వరం, కందుకూర్, బాలాపూర్ మండలాల్లో గ్రామాలు, బస్తీలలో ప్రజలను, కార్మికులను చైతన్యం చేస్తూ ప్రచారం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి బి. దత్తు నాయక్, జిల్లా నాయకులు పల్నాటి యాదయ్య, మహేశ్వరం మండల కార్యదర్శి పి. దేవేంద్ర గౌడ్, కందుకూరు మండల కార్యదర్శి కొమ్మగళ్ళ రాజు, బ్రహ్మచారి రామచంద్రయ్య, రమేష్, యాదగిరి, శ్రీను, రాణి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులై... ఘనంగా స్వపరిపాలన దినోత్సవం






**యాచారం జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యాచారం మండలం మేడిపల్లి నక్కర్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి బోధన నిర్వహించారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పి, పాఠశాల పరిపాలనలో భాగస్వామ్యం అవుతూ తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రలను పోషిస్తూ అందరినీ అలరించారు. జిల్లా కలెక్టర్‌గా వి. గోపి, డీఈఓగా బి. గౌతమి, పాఠశాల హెడ్‌మాస్టర్‌గా వీ. చరణ్, ఎమ్మెల్యేగా వి. శివ, ఉపాధ్యాయులుగా వివిధ తరగతుల విద్యార్థులు వ్యవహరించి చక్కటి బోధన ప్రదర్శన చేశారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, ప్రధానోపాధ్యాయులు ఉదయశ్రీతో కలిసి బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యురాలు మాధవి, ప్రధానోపాధ్యాయులు ఉదయశ్రీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. స్వపరిపాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాభావం పెంపొందుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల ఉత్సాహం, సృజనాత్మకత, సమన్వయం ఈ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపాయి.

## సర్పంచుల ఫోరం అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేసిన నిజాం నగర్ సర్పంచి వింజమూరి శశికళశేఖర్



**దేవరకొండ జనవరి 09. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
డిండి మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ లో నూతన సర్పంచులకు సన్మాన కార్యక్రమంలో మరియు సర్పంచుల డిండి మండలం ఫోరం అధ్యక్షులుగా ఎన్నిక కాబడిన శాంతిగూడెం గ్రామపంచాయతీ సర్పంచి చింతలపూడి భాస్కర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేసిన నిజాం నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వింజమూరి శశికళశేఖర్ మరియు ఉప సర్పంచ్ నల్లవెల్లి వెంకటయ్య. ఈ సందర్భంగా డిండి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షడిగాకి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించడం జరిగింది.

# వ్యవసాయ పనిముట్లను వినియోగించుకోవాలి

-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, జనవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ప్రభుత్వం నుండి వచ్చే వ్యవసాయ యాంత్రీకరణ పథ కాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే పేర్కొన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆమనగల్లు డివిజన్ కు 18 పరికరాలు లక్షకు పైగా రాయితీ పరికరాలు,అదే విధంగా 34 పరికరాలు లక్షపు లోపు సబ్సిడీ పరికరాల ప్రొసీడింగ్ ఇస్తూ, ప్రభుత్వం నుండి వచ్చే రాయితీ పని ముట్లను రైతులు వినియోగించు కోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ గీత, వైస్ చైర్మెన్ భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉష , ఏడీఏ పద్మజ, ఆమనగల్లు ఏడీఏ శోభ రాణి,ఏవోలు శ్రీనివాస్ గౌడ్, అరుణ కుమారి, రేణుక చక్రవర్తి,కవిత, ఏ ఈవోలు, నాయకులు నర్సింహా,ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బిక్షపతి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గొడకొండ్ల సర్పంచ్ కు ఘన సన్మానం

**యాచారం , జనవరి 09 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ కాశగోని వెంకటయ్య ను శుక్రవారం భారతీయ జనతా పార్టీ తెలంగాణ (బిజెపి ) జెయింట్ సెక్రెటరీ కొప్పు భాష మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సంద్భంగా కొప్పు భాష



మాట్లాడుతూడ బీజేపీ పార్టీపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించినందుకు, ప్రజలకు బీజేపీ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా , గ్రామ అభివృద్ధిని చేస్తూ వ్యక్తిగతంగా, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలు





**వినోభా నగర్,జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజూ నారాయణ యాగం, తిరుప్పావై సేవలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. 24వ రోజున నారాయణ యాగం, లక్ష్మి నారాయణులకు పసుపు కొట్నం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పండితులు ధనుర్మాసం ప్రత్యేకతను, జరగబోయే కార్యక్రమాల విశిష్టతను భక్తులకు వివరించారు. పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొని తీర్థ



ప్రసాదాలను స్వీకరించారు. ధనుర్మాసంలో ప్రతిరోజూ నారాయణ యాగం జరుగుతుండగా, జనవరి 11న 108 గంగాలతో పాయసం నివేదన, జనవరి 12న మహా పూర్ణాహుతి, జనవరి 13న నవకలశ స్నపన, గోదా రంగనాథ స్వామి ఎదురుకోళ్ల ఉత్సవం, జనవరి 14న గోదా రంగనాథ స్వామి కల్యాణం మరియు వివాహం కానివారి కోసం వారణమాయిరం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని పండితులు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు



**అమరాబాద్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పదరా మండల కేంద్రంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఇంచార్జి సయ్యద్ ఖాలీద్ సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కేటీఆర్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్నాల హరికృష్ణ నేతృత్వంలో దిష్టిబొమ్మను నడిరోడ్డుపై దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి రసనూరి మహేష్, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నరసింహ, చిట్లంకుంట సర్పంచ్ ముని లాలు, మరడుగు సర్పంచ్ హనుమ, మద్దిమడుగు డైరెక్టర్ సుబ్బదాసు, డిప్యూటీ సర్పంచ్ రేనయ్య, హలీం, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మోటామారి రాజు, మండల యువజన ఉపాధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శులు మోతిలాల్, నరేష్, యువజన కాంగ్రెస్ నాయకులు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం.....నిర్లక్ష్యం

**ఆమనగల్లు, జనవరి 9(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తను కాల్చకుండా పర్యావరణహితంగా వినియోగించాలనే ఉద్దేశంతో, దానిని కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు అందించి పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఆర్థిక లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం రూ.లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. మండలంలోని 13 గ్రామ పంచాయతీలతో పాటు ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోనూ ఈ నిర్మాణాలు చేపట్టారు. అయితే లక్ష్యం గొప్పదైనా, అమలులో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నేటికీ వినియోగానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువులు తయారు చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రజాధనంతో నిర్మించిన ఈ సదుపాయాలు ప్రయోజనం లేకుండా ఉండిపోవడం పట్ల ప్రజల్లో



అసంతృప్తి వ్యక్తమవుతోంది. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఆర్థికాభివృద్ధి, రైతులకు తక్కువ ఖర్చుతో ఎరువుల లభ్యత వంటి అనేక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన ఈ షెడ్లను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ ప్రజలు, పట్టణవాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, నిర్లక్ష్యాన్ని వీడి లక్ష్యసాధన దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఘనంగా రంగాపూర్ జాతర పోస్టర్ ఆవిష్కరణ



**అమ్రాబాద్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండల కేంద్రంలో జరగబోయే హజ్రత్ నిరంజన్ షా వలి (ర) ఉర్స్ ఏ షరీఫ్ 121వ గంధోత్సవానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముస్లిం మైనార్టీ కమిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ సర్పంచ్ చిగుర్ల కోటయ్య, ఉప సర్పంచ్ నోముల రాజారాం గౌడ్, ముస్లిం మైనార్టీ పెద్దలు ఇక్బాల్, హిదాయత్ అలీ, షమీం, జమీల్ అరిఫ్ పాల్గొన్నారు. గంధోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్ అలీ, ఉపాధ్యక్షులు ఖదీర్, పర్వేజ్, కార్యదర్శి ఇలియాజ్, జునైద్, రహీం, నల్లమల్ల గాయకుడు కన్నం సుధాకర్, సామా నిరంజన్, స్థానిక యువకులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్ చిగుర్ల కోటయ్య, ఉప సర్పంచ్ నోముల రాజారాం గౌడ్‌లను ఘనంగా సన్మానించారు.

# ఘనంగా నూతన ట్రాఫిక్ ఎస్ఐని సన్మానించిన బిజెపి నాయకులు



**హుస్నాబాద్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మొదటి సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దండు శ్రీనివాస్‌ను బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్, పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి రాయికుంట చందు, సీనియర్ నాయకుడు పోలోజు రవీందర్, బీజేవైఎం సిద్దిపేట జిల్లా ప్రతినిధి పెందోట భూశంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు సాయి కృష్ణ పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు, వాహనదారుల భద్రతకు ప్రత్యేక చొరవ చూపాలని నాయకులు ఎస్ఐను కోరారు. ఎస్ఐ శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ ప్రజల సహకారంతో ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు.

# హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి

**-- ఎస్. శివకుమార్**




**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయస్థానం నుండి ఇందిరా గాంధీ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీని న్యాయమూర్తి శివకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ కట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్ల అనేక ప్రాణాలు కోల్పోతున్నారని, కొంతమంది శాశ్వతంగా అంగవైకల్యం పొందుతున్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ కమిషనర్ పి. పురుషోత్తం, ట్రాఫిక్ ఏసీపీ స్వామి, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, జనరల్ సెక్రటరీ కే. అరుణ్ కుమార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, న్యాయవాదులు, రవాణా మరియు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవంతంగా అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం సభ



**గంగాధర, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మల్లాపూర్ గ్రామం నడింపల్లి అంగన్‌వాడి కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కోలేపాక కవిత, ఉప సర్పంచ్ తుడి తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్ హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలకు బలమృతం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సభలో టీచర్ కవిత, ఆయా శైలజ, ఆశా శారదతో పాటు గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అయోధ్య మార్గంలో మాంసాహారంపై నిషేధం

**అయోధ్య:జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అయోధ్య, పంచకోశి పరిక్రమ మార్గాల్లో మాంసాహారంపై నిషేధం విధించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయించింది. స్థానికంగా మత, సంస్కృతి పరమైన పవిత్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ నిషేధం మాంసం దుకాణాలు, హోటళ్లు, వసతి గృహాలు, హోం స్టేలతో పాటు ఆన్‌లైన్ ఆర్డర్లకు వర్తిస్తుంది. వసతి గృహాలు, హోం స్టేలలో మాంసాహార వడ్డనపైనా నిషేధం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ నిషేధ ఉత్తర్వుల అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపింది.

# బసంతనగర్ వాసి చింతకింది కిరణ్ కుమార్‌కు అరుదైన గౌరవం



పాలకుర్తి, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పాలకుర్తి మండలం బసంతనగర్ బీసీ కాలనీకి చెందిన చింతకింది కిరణ్ కుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. పంజాబ్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నిర్వహించిన 12వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. యు.కే మాజీ ప్రధాని మేరీ ఎలిజిబెత్ ట్రస్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకోవడం ఆయనకు విశేష గౌరవంగా నిలిచింది. కిరణ్ కుమార్ సిగ్నల్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన పరిశోధన అంశం వేరియింగ్ ఇల్యూమినేషన్ కండిషన్స్‌లో ఆబ్జెక్ట్ డిటెక్షన్ అండ్ ట్రాకింగ్ సిస్టం ఇది ఆధునిక ఇమేజ్ మరియు వీడియో టెక్నాలజీకి సంబంధించినది. ఈ విజయంతో బసంతనగర్ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ కిరణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## సమృద్ధిగా యూరియా నిలువలు

-- కలెక్టర్



కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) రైతులందరికీ అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గత పది రోజుల్లో జిల్లాలోని వివిధ సొసైటీలకు 6665 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 2553 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, అవసరాన్ని బట్టి మరిన్ని నిల్వలు తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అవసరమైనంత మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు.

## గాయత్రి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఐదవ రోజు శీతాకాల శిబిరం







పెద్దపల్లి, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రంగాపూర్ గ్రామంలో గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ఐదవ రోజు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ రంగారావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధు వాలంటీర్లను ఉద్దేశించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల అనేక కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని సూచించారు. మత్తు పదార్థాలు సేవించి డ్రైవింగ్ చేయరాదని, జీబ్రా లైన్స్ వద్ద పాదాచారులను గమనిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. తరువాత జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీ. శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ఏ. సమద్, ఉపాధ్యాయులు ఆమని, కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) క్రీడా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాణించాలని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం నుండి ప్రారంభమైన సీఎం కప్--2025 టార్చ్ ర్యాలీని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ర్యాలీ తెలంగాణ చౌక్ వరకు కొనసాగింది. ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతూ మేడిపల్లి సత్యం, గతంలో క్రీడాకారులకు రాష్ట్రంలో అవకాశాలు తక్కువగా ఉండేవని, ప్రస్తుత ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తూ ప్రోత్సాహకాలు కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ దిగ్గజం మిస్సితో ఆడి విద్యార్థుల్లో, క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారని గుర్తుచేశారు. రాష్ట్రం నుండి ఒలింపిక్స్ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో అనేక మంది ముందుకు వెళ్తున్నారని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు నిధులు వెచ్చిస్తూ సదుపాయాలు కల్పిస్తున్నామని, క్రీడల ద్వారా మానసిక--శారీరక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో రాణించాలని సూచించారు. కరీంనగర్ క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎన్నో మెడల్స్ సాధించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, జిల్లా యువజన అధికారి రాంబాబు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్, పదాల రాహుల్, సిద్ధారెడ్డి, యోగాసన సభ్యులు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రైవేట్ పీడీ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వవిద్యాలయ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఉపకులపతి



కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) శాతవాహన విశ్వవిద్యాలయానికి చెందిన అభ్యాస బాలుర వసతి గృహాన్ని ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ పరిశీలించారు. విద్యార్థుల వసతులు, భోజనశాల, పరిసరాల పరిశుభ్రతపై సమీక్ష నిర్వహించి, నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. తరువాత విశ్వవిద్యాలయ ఇంజనీర్‌కు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంలో చీఫ్ వార్డెన్ డాక్టర్ నజీముద్దీన్ మునవర్, వార్డెన్లు డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కిరణ్, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల సమావేశం



కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) రేకుర్తి శుభం గార్డెన్స్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ అధ్యక్షతన కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, కోమాల ఆంజనేయులు, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ సంక్రాంతి తరువాత మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని, కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీకి అనుకూల వాతావరణం నెలకొన్నదని తెలిపారు. టిక్కెట్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని, కుటుంబ సభ్యుల ద్వారా పైరవీ చేసే వారికి టిక్కెట్ ఇవ్వబోమని స్పష్టం చేశారు. గెలుపు గుర్రాలకే సీట్లు కేటాయిస్తామని, బీజేపీలో కుటుంబ జోక్యం ఉండదని తేల్చి చెప్పారు. నాయకులు ఏకముగా 'టిక్కెట్ ఎవరికి ఇచ్చినా గెలిపిస్తాం, సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి. మాకు టిక్కెట్ రాకపోయినా రెబల్‌గా పోటీ చేయం, కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేస్తాం అంటూ నినదించారు. గడప గడపకూ వెళ్లి కేంద్రం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామని తెలిపారు. బయట పార్టీల నుండి చేరదలచిన వారిలో అవినీతిపరులను, కబ్జాదారులను మాత్రం చేర్చవద్దని బండి సంజయ్ సూచించారు.

## గ్రామ అభివృద్ధి, త్రాగునీటి సమస్యపై వినతి



కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మానకొండూర్ గ్రామపంచాయతీ సభ్యులు, మాజీ జెడ్పిటీసి తాళ్లపల్లి శేఖర్ కలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి పనులు, ముఖ్యంగా త్రాగునీటి సమస్యపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యులు, బిజెపి నాయకులు మంగబత్తుల స్వప్న, భాషబోయిన ప్రదీప్ యాదవ్ పాల్గొన్నారు.

## ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) ఆర్‌బీఎల్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ సాయినగర్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద నిర్వహించిన ఉచిత ఆరోగ్య, కంటి పరీక్షల శిబిరానికి ప్రజలు విశేషంగా స్పందించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్‌లో బిజెపి సీనియర్ నాయకులు వాసాల అఖిల్, బొద్దు అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో దాదాపు 850 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హిమోగ్లోబిన్, రాండమ్ బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్, బిపి, థైరాయిడ్, విటమిన్ డి, బి12 వంటి పరీక్షలు నిర్వహించబడ్డాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని విజయవంతం చేశారు.

## శబరిమల ఆలయ ప్రధాన పూజారి అరెస్ట్

తిరువనంతపురం, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కేరళ లోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో బంగారం తాపడాల చోరీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు శుక్రవారం తెల్లవారుజామున శబరిమల ప్రధాన పూజారి కందరారు రాజీవరును అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. పలువురు సాక్షులతో పాటు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) మాజీ అధ్యక్షుడు ఏ పద్మకుమార్ కూడా ఉన్నికృష్ణన్‌తో రాజీవరుకు ఉన్న సంబంధాన్ని నిర్ధారించారు. తంత్రి ఆయనకు ఆలయ ప్రవేశాన్ని, అనధికార బంగారు పూత పనులకు మార్గం సులభం చేశారని తెలిపారు. పలువురు ఆలయ ఉద్యోగులు కూడా తంత్రి ప్రమేయాన్ని వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపనలు




**పెద్దపల్లి, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలోని 13, 14, 32, 33 వార్డుల్లో అర్హులైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతున్నాయని తెలిపారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ పేరిట పేదలను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులందరికీ ఇళ్లు మంజూరు అవుతున్నాయని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, కొత్త బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, కోర్టు భవనం నిర్మాణం వంటి పనులు కాంగ్రెస్ హయంలో జరుగుతున్నాయని గుర్తు చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రజలందరూ వాటిని గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు



**పాలకుర్తి, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి గ్రామంలో ఎట్టకేలకు వీధి దీపాలు ఏర్పాటు కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా గ్రామంలో దీపాలు లేకపోవడంతో రాత్రివేళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ఇప్పుడు ఊరట పొందారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పెద్దపల్లి తిరుమల తన స్వంత ఖర్చుతో 150 వీధి లైట్లు కొనుగోలు చేసి గ్రామంలో ఏర్పాటు చేయించారు. శుక్రవారం ఆయన స్వయంగా దీపాలను కరెంటు స్తంభాలకు అమర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కొత్త పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

# కరీంనగర్‌కు ఆయుష్ ఆసుపత్రి మంజూరు



**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉత్తర తెలంగాణ ప్రజలకు శుభవార్త. కరీంనగర్‌లో 50 పడకల "ఆయుష్ణ' ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి ఇప్పటికే రూ.7.5 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఆయుర్వేదం, యోగా నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి చికిత్సలను అందించే ఈ ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు కేంద్ర ఆయుష్ శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేసింది. ఈ ఆసుపత్రిలో కాయచికిత్స, పంచకర్మ, శల్య, శాలాక్య, ప్రసూతి, స్త్రీరోగ చికిత్సలతో పాటు యోగా, హోమియోపతి సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి విభాగానికి నిపుణ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు నియమించనున్నారు. కేంద్రం అనుమతుల అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆయుష్ అధికారులతో చర్చించి స్థల ఎంపికపై దృష్టి సారించారు. త్వరలోనే ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ఆసుపత్రి ఏర్పాటుతో ఉత్తర తెలంగాణ ప్రజలకు సాంప్రదాయ వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి.

## గుండెపోటుతో మృతి చెందిన యువకుడి పార్థివ దేహం వైద్య కళాశాలకు అప్పగింత



**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కిసాన్ నగర్‌కు చెందిన పసుల జీవన్ (47) గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో పార్థివ దేహాన్ని చల్మెడ ఆనందరావ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎడ్ల సరిత అశోక్, ప్రభుత్వ ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో వైద్య విద్యార్థుల పరిశోధన కోసం శరీరాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ కన్వీనర్ కనకయ్య జీవన్‌కు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యుల మానవతా నిర్ణయాన్ని అభినందించారు. కుమారుడి హఠాన్మరణం వల్ల తీవ్ర బాధలో ఉన్నప్పటికీ సమాజహితం కోసం ముందడుగు వేసిన తల్లిదండ్రులు లక్ష్మ, నాగయ్యతో పాటు కుటుంబ సభ్యులకు పలువురు నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు భద్రతా అవగాహన సదస్సు




**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
37వ జాతీయ రోడ్డు భద్రతా సంవత్సరం-2026 సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ కరీంనగర్ & సేఫర్ ఇండియన్ రోడ్స్ ఆధ్వర్యంలో కిసాన్ నగర్ శ్రీ సాయి హైస్కూల్‌లో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ పోలీస్ ఎస్‌హెచ్‌ఓ ఎం.డి. కరీం ఉల్లా ఖాన్ విద్యార్థులకు రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. మైనర్ వయస్సు పిల్లలు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకు ఎలాంటి మోటారు వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులు మరియు వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఇంటింటికీ రోడ్డు భద్రతా అవగాహనను వ్యాప్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి హైస్కూల్ డైరెక్టర్ ఎన్. రాధా కృష్ణ నాయర్, ఘన్‌షామ్ ఓజా, ఎం.డి. అబ్దుల్ అస్లాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**పాలకుర్తి, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈసాల తక్కలపల్లి గ్రామ శివారులోని రామారావుపల్లి పుట్నూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న కోరండ్ల సత్యనారాయణ రెడ్డి వ్యవసాయ బావిలో శుక్రవారం గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుని వయస్సు 30--40 సంవత్సరాల మధ్యగా ఉండి, పసుపు రంగు గీతల షర్ట్, బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడు. షర్ట్ కాలర్‌పై జేఎంకేటి అని ఉండటం గమనార్హం. మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు బసంతనగర్ ఎస్ఐ (8712656509) లేదా పెద్దపల్లి సీఐ (8712656505) ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు కోరిన ఎస్జీటీయూ




**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐజెఏసీటీవో) పిలుపు మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. 2010 ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వడంతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు అవకాశం కల్పించాలని వారు కోరారు.

## కోర్టు భవనం నిర్మించాలని న్యాయవాదుల డిమాండ్



**పెద్దపల్లి, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కోర్టు భవన నిర్మాణ స్థలం విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. పట్టణంలోనే కోర్టు నిర్మించాలనే డిమాండ్‌తో కమాన్ చౌరస్తా, అయ్యప్ప ఆలయం, జెండా చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాఘవపూర్‌లో స్థలం కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, పెద్దపల్లిలోనే కావలసినంత ప్రభుత్వ స్థలం ఉందని, అక్కడే కోర్టు నిర్మాణం జరగాలని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఇది న్యాయవాదుల స్వార్థం కోసం కాదని, న్యాయం కోసం వచ్చే కక్షదారుల సౌలభ్యం దృష్టిలో పెట్టుకొని చేస్తున్న పోరాటమని తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోనే జిల్లా కోర్టు నిర్మించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వెంకట్రావుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ముందస్తు సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి అందరిని ఆకట్టుకున్నారు. విద్యార్థినులు వేసిన ముగ్గులు పాఠశాల ప్రాంగణాన్ని మరింత అందంగా మార్చాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నేవూరి కరుణాకర్, ఉపాధ్యాయులు శ్యామదత్తు, గీత, శ్రీలత, రవీందర్, ఆంజనేయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు

**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. 2025 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు 750 సీసీ కెమెరాల ద్వారా లక్షలాది కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఆన్ రోడ్ పార్కింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్,



నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై పెద్ద సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, జరిమానాల కోసం కాదు అని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సీసీ కెమెరాల ద్వారా నేరుగా చలాన్లు ఇంటికి వస్తాయని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ ఎన్నికలపై ఫార్వర్డ్ బ్లాక్ వ్యూహం



**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో రామగుండం కార్పొరేషన్‌లో 9 మంది, చొప్పదండి మున్సిపల్‌లో ఒకరు, కరీంనగర్ కార్పొరేషన్‌లో ముగ్గురు కార్పొరేటర్లు విజయం సాధించారని గుర్తుచేశారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు రూపొందిస్తున్నామని, ఉమ్మడి జిల్లాలోని 2 కార్పొరేషన్‌లు, 9 మున్సిపాలిటీలలో సింహం గుర్తుతో పోటీ చేసి ఎక్కువ స్థానాలు గెలుచుకోవాలని సంకల్పించామని తెలిపారు. ఆశావహులు పార్టీ జిల్లా కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని, సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. బి-ఫామ్‌లు జిల్లా కమిటీ ఆమోదంతో రాష్ట్ర కమిటీ ద్వారా ఇవ్వబడతాయని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అతికం రాజశేఖర్, పి. అరుణ్, అజిత్ రావు, రావుల ఆదిత్య, కురువెల్లి శంకర్, ప్రశాంత్ కుమార్, బద్రి నేత, బొంకురి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా




**కరీంనగర్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అఖిల భారత కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల జాతీయ సమాఖ్య పిలుపు మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన పెన్షనర్లు శుక్రవారం మధ్యాహ్నం టవర్ సర్కిల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెన్షనర్లు కరీంనగర్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని, కరోనా సమయంలో నిలిపివేసిన డీఏ వాయిదాలను విడుదల చేయాలని, రైల్వే ప్రయాణంలో సీనియర్ సిటిజన్లకు రద్దు చేసిన టికెట్ రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షన్ వాలిడేషన్ బిల్లును వెనక్కి తీసుకోవాలని, కమ్యూటేషన్ పీరియడ్ తగ్గించాలని, మెడికల్ అలవెన్సు పెంచాలని కోరారు. దేశవ్యాప్తంగా 70 లక్షల కేంద్ర పెన్షనర్లు ఈ ధర్నాలో పాల్గొంటున్నారని నాయకులు తెలిపారు. కరీంనగర్ ధర్నాకు పోస్టల్, ఆర్‌ఎమ్‌ఎస్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. లక్ష్మపతి, ప్రధాన కార్యదర్శి కే. చంద్రమోహన్ రావు, కోశాధికారి యస్వడా చంద్రమౌళి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల రామేశం నాయకత్వం వహించారు. నర్సింగరావు, రాజయ్య, రాజాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటక కళాకారులకు ఘన సన్మానం





**హుస్నాబాద్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ వి.ఎల్. ఫంక్షన్ హాల్లో భాషా సాంస్కృతిక శాఖ, స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి జానపద సాంస్కృతిక జాతరలో చిగురుమమిడి మండల కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండల కళాకారుల కమిటీ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ప్రదర్శించగా, వేషధారణతో కళ్ళకు కట్టినట్టు సన్నివేశాలను ఆవిష్కరించారు. తరువాత కళాకారులందరికీ సంకల్ప స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్, జానపద సకల వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షురాలు తాళ్లపెల్లి సంధ్య గౌడ్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్‌తో పాటు చందబోయిన పరశురాములు, మల్లం బాలయ్య, నిలిగొండ కిషన్, శ్రీరామోజు రాములు, శ్రీమూర్తి సమ్మయ్య, పెసరు బాలయ్య, చిట్టంపల్లి మురళి, చందబోయిన మల్లయ్య, దాసరి మధు, మొగిలి బొందయ్య, తౌటు రాజారాం, గవ్వ వంశీధర్ రెడ్డి, వీరస్వామి చంద్రయ్య, జగదీశ్వర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ అభివృద్ధి

**- కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ రూరల్, జనవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, గ్రామం, సమాజం అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బొమ్మకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన శుక్రవారం సభలో ఆమె పాల్గొన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ముందస్తుగా వ్యాధులను గుర్తించి చికిత్స పొందే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. క్యాన్సర్ కేసులు కూడా ఈ పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించి చికిత్స అందించిన ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డబ్బు వృథ చేసుకోవద్దని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించడం ద్వారా చదువుతో పాటు పోషణపై దృష్టి సారిస్తున్నామని, లోప పోషణ నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ శుక్రవారం సభ ప్రారంభమైనప్పటి నుండి మహిళల ఆరోగ్యం మెరుగైందని, అనేకమంది రక్తహీనతను అధిగమించారని వివరించారు. మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వ పథకాలు, ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను పరిశీలించి, విద్యార్థులు నిర్భయంగా తమ సమస్యలను అందులో నమోదు చేయాలని సూచించారు. భవితా కేంద్రాన్ని పరిశీలించి దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బొమ్మకల్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ జకినపల్లి హారికను కలెక్టర్ సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన హారికను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డిడబ్ల్యుఓ సుగుణ, సిడిపిఓ సబిత, తహసీల్దార్ రాజేష్, వైద్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ఐఆర్పి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# 7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





**ఇబ్రహీంపట్నం, జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి డివిజన్‌లో అవసరమైన పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని ఆయన అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన తహసిల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ అనంతరెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించిన అనంతరం, పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పర్యటిస్తూ, అండర్ డ్రైనేజ్, సీసీ రోడ్లు, శుభ్రత వంటి సమస్యలను పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ఎలా అని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, రాబోయే ఆరు నెలల్లో అండర్ డ్రైనేజ్, సీసీ రోడ్ల పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంబల్లపల్లి గుర్నాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు ఆకుల ఆనంద్ కుమార్, ఆదిభట్ల మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్త ఆర్థిక ప్రవీణ్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, ఈర్లపల్లి సునీత వెంకటరెడ్డి, భర్తకి జగన్, బర్ల జగదీష్, కాంగ్రెస్ నాయకులు మొద్దు కరుణాకర్ రెడ్డి, దారు రాఘవేంద్రరావు, మహమ్మద్ గౌస్, మహమ్మద్ మునీర్, ఆముదాల యాదగిరి, ఇందూరి శ్రీనివాస్, ఇమ్రాన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.





# మాలక్‌పేట్‌లో దివ్యాంగుల ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**హైదరాబాద్ జనవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాలక్‌పేట్‌లో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ప్రధాన కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బండా జగన్, ప్రధాన కార్యదర్శి బక్క సుధాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించబడింది. అనంతరం దివ్యాంగుల నాయకులు వీరయ్యకు గజామాలతో సన్మానం చేశారు. చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ "ఇంత చక్కటి కార్యక్రమానికి ఆహ్వానించిన జగన్, సుధాకర్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణ ఉద్యమంలో దివ్యాంగుల సమాజం కీలక పాత్ర పోషించింది. రానున్న రెండు నెలల్లో దివ్యాంగుల పింఛను రూ.4016 నుండి రూ.6016కి పెరుగుతుంది. ప్రస్తుత సమాజంలో దివ్యాంగులు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకం" అని పేర్కొన్నారు. అధ్యక్షుడు బండా జగన్ మాట్లాడుతూ "ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి వారంలోనే జీతాలు అందుతున్నాయి. ఖాళీగా ఉన్న బ్లాక్ లాక్ పోస్టులను భర్తీ చేస్తే దివ్యాంగులకు ఉపాధి లభిస్తుంది" అని అన్నారు. టీవిహెచ్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ – "గతంలో మినిమం డిగ్రీ లేదా ఉన్నత చదువులు చదివిన దివ్యాంగులకే నాలుగు చక్రాల స్కూటీలు ఇచ్చేవారు. కానీ ప్రస్తుత ప్రజాపాలనలో అర్హత ఉన్న ప్రతి దివ్యాంగులకు వాహనాలు అందించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకి దివ్యాంగుల సమాజం తరపున ప్రత్యేక ధన్యవాదాలు" అని తెలిపారు.

# బిజినెస్

# త్వరలో జియో మెగా పబ్లిక్ ఇష్యూ..
# ఈ ఏడాదే ఐపీవోకు రానున్న సంస్థ

రూ.40,000 కోట్ల సమీకరణకు యోచన

అమ్మకానికి 2.5 శాతం వాటా

**న్యూఢిల్లీ, జనవరి 9**
భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రిలయన్స్ జియో సిద్ధమవుతున్నది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఈ టెలికాం సంస్థ.. ఈ ఏడాది ఎలాగైనా పబ్లిక్ ఇష్యూకు రావాలన్న అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నది. నిజానికి 2019లోనే జియో ఐపీవోకు ముకేశ్ ప్రణాళికలు వేశారు. అయితే కంపెనీ విలువ పెరిగేదాకా ఆగితే మంచిదన్న అభిప్రాయాలతో వెనుకకు తగ్గారు. అయితే ఇదే సరైన సమయమని ఇప్పుడు భావిస్తున్న అంబానీ.. ఈ సంవత్సరం ప్రథమార్థంలో జియో షేర్లను స్టాక్ మార్కెట్లలోకి ఎక్కించాలని చూస్తున్నారు. కాగా, పబ్లిక్ ఇష్యూలో 2.5 శాతం వాటాను విక్రయించాలని యోచిస్తున్నట్టు సమాచారం. దీని విలువ ఏకంగా రూ.40,000 కోట్లపైనే (4.5 బిలియన్ డాలర్లు) కావడం గమనార్హం. ఇప్పటిదాకా ఈ స్థాయిలో నిధుల సమీకరణ అనేదే జరుగలేదు. దీంతో పబ్లిక్ ఇష్యూలలో జియో ఐపీవోను బాహుబలిగా అభివర్ణిస్తున్నారంతా. అన్నీ కుదిరితే జూన్‌కల్లా జియో ఐపీవో రావచ్చన్న అంచనాలైతే ఉన్నాయి.




**రూ.16.2 లక్షల కోట్లుగా..**
ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్.. గత ఏడాది నవంబర్‌లో రిలయన్స్ జియో విలువను రూ.16.2 లక్షల కోట్లు (180 బిలియన్ డాలర్లు)గా అంచనా వేసింది. దీని ప్రకారం ఐపీవో ద్వారా అమ్మాలనుకుంటున్న 2.5 శాతం వాటా విలువ 4.5 బిలియన్ డాలర్లుగా తేలుతున్నది. డాలర్‌తో పోల్చితే ప్రస్తుతం రూపాయి మారకం విలువ ప్రకారం.. ఇది రూ.40,000 కోట్లపైనే. అయితే కొన్ని బ్యాంకులు జియో వ్యాపారం విలువను 200 బిలియన్ డాలర్ల నుంచి 240 బిలియన్ డాలర్ల వరకు లెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే పబ్లిక్ ఇష్యూలో నిధుల సమీకరణ ఎంత? ఉంటుందన్న దానిపై ఇప్పుడే స్పష్టత రాకుండా ఉన్నది. ఐపీవో పరిమాణానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచీ అనుమతులు రావాల్సి ఉన్నదని అంటున్నారు.

## స్టాక్ మార్కెట్లు బేజారు..

సెన్సెక్స్ 604, నిఫ్టీ 193 పాయింట్లు డౌన్



**ముంబై, జనవరి 9**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదోరోజూ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలకు తోడు ఎఫ్‌ఐఐలు అమ్మకాలకు మొగ్గుచూపడం సూచీలు నష్టాల పాలయ్యాయి. వీటికి తోడు అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు నష్టాలకు మరింత ఊతమిచ్చాయి. ఫలితంగా ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. ముఖ్యంగా రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్, ఆటో స్టాక్స్‌లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 25 వేల దిగువకు జారుకున్నది.
చివరకు సెన్సెక్స్ 604.72 పాయింట్లు కోల్పోయి 84 వేల దిగువకు 83,576.24 వద్దకు జారుకున్నది. అలాగే 50 షేర్ల ఇండెక్స్ సూచీ నిఫ్టీ సైతం 193.55 పాయింట్లు కోల్పోయి 25,683.30 వద్ద స్థిరపడింది. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. దేశీయ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 500 శాతం సుంకం విధించనున్నట్టు ప్రకటించడంతో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. ప్రస్తుతం మార్కెట్లో సెంటిమెంట్ నిరుత్సాహకరంగా ఉన్నదని, ఉద్రిక్త పరిస్థితులకు తోడు ట్రంప్ టారిఫ్ బాంబు పేల్చనుండటం మదుపరుల్లో ఆందోళన నెలకొన్నదని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

## ఇన్నోవా క్రిస్టా మరింత ప్రియం

**న్యూఢిల్లీ, జనవరి 9**
వాహన కొనుగోలుదారులకు టయోటా షాకిచ్చింది. ప్రీమియం ఎస్‌యూవీలైన ఫార్చ్యూనర్, ఇన్నోవా క్రిస్టా, హైక్రాస్ మాడళ్ల ధరలను రూ.74 వేల వరకు పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. వీటిలో ఇన్నోవా క్రిస్టా మాడల్ రూ.33 వేల వరకు పెంచుతుండగా దీంతో ప్రస్తుతం ఈ మాడల్ రూ.18.99 లక్షల నుంచి రూ.25.53 లక్షల లోపు దేశవ్యాప్తంగా లభిస్తున్నది. అలాగే ఇన్నోవా హైక్రాస్ మాడల్‌ను రూ.48 వేల వరకు సవరించడంతో దీని ధర రూ.19.15 లక్షల నుంచి రూ.32.38 లక్షల లోపు చేరుకున్నది. దీంతోపాటు ఫార్చ్యూనర్ రూ.74 వేలు, లెజెండరీ మాడళ్ల ధరలను రూ.71 వేలు వరకు సవరించింది. వీటి ధరలు రూ.34.16 లక్షల నుంచి రూ.49.59 లక్షల లోపు లభిస్తున్నాయి. కానీ, టైజర్, హైరైడర్, రుమియన్, హిలక్స్, క్యామ్రీ, వెల్‌ఫైర్, ల్యాండ్ క్రూజర్ 300 మాడళ్ల ధరలను యథతథంగా ఉంచింది. మరోవైపు, హైక్రాస్, ఫార్చ్యూనర్ మాడళ్లను నిలిపివేసేయోచనలో సంస్థ ఉన్నట్టు తెలుస్తున్నది.



# బెంగళూరు బోణీ..
# ఉత్కంఠ పోరులో ముంబైపై విజయం

## నదైన్ ఆల్‌రౌండ్ షో

ముంబై
మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్‌ను మాజీ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలుపుతో ఆరంభించింది. నవీ ముంబైలోని డాక్టర్ డీవై పాటిల్ వేదికగా ఆఖరి బంతివరకూ ఉత్కంఠగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఆర్‌సీబీ.. డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై 3 వికెట్ల తేడాతో గెలిచి టోర్నీలో శుభారంభం చేసింది. ముంబై నిర్దేశించిన 155 పరుగుల ఛేదనలో బెంగళూరు 20 ఓవర్లకు 157/7 చేసింది. నదైన్ డి క్లెర్క్ (44 బంతుల్లో 63లి, 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) బ్యాట్‌తో పాటు బంతి (4/26)తోనూ రాణించి ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. సజీవన్ సజనా (25 బంతుల్లో 45, 7 ఫోర్లు, 1 సిక్స్), నికోల కేరీ (29 బంతుల్లో 40, 4 ఫోర్లు) ఆదుకోవడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 154 రన్స్ చేసింది.



**నదైన్ షో..**
స్వల్ప ఛేదనను ధాటిగా ప్రారంభించిన బెంగళూరు.. 4 ఓవర్లలోనే 40 పరుగులు చేసింది. హారీస్, కెప్టెన్ స్మృతి బౌండరీలతో విరుచుకుపడటంతో ఆ జట్టు విజయం నల్లేరు మీద నడకే అనుకున్నారంతా. కానీ 4వ ఓవర్లో ఇస్మాయిల్.. స్మృతిని ఔట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికింది. ఐదో ఓవర్లో సీవర్.. హారీస్‌ను ఔట్ చేయగా హేమలత (7)ను అమన్‌జ్యోత్ వెనక్కిపంపింది. 8వ ఓవర్లో బంతినందుకున్న కెర్.. రాధా యాదవ్(1)తో పాటు రిచా ఘోష్ (6)నూ ఔట్ చేసి బెంగళూరును దెబ్బకొట్టింది. 7.4 ఓవర్లలో 65/5గా ఉన్న ఆర్‌సీబీని అరుంధతి (20), డి క్లెర్క్ ఆదుకున్నారు. 6వ వికెట్‌కు ఈ జోడీ 52 రన్స్ జోడించి బెంగళూరును విజయం వైపు నడిపించింది. విజయానికి 37 పరుగుల దూరంలో అరుంధతి నిష్క్రమించడంతో ఆ జట్టు మళ్లీ తడబడింది. ఆఖరి 6 బంతుల్లో 18 రన్స్ అవసరముండగా క్లెర్క్.. 6, 4, 6, 4తో ఆ జట్టుకు విజయాన్ని అందించింది.

**ఆదుకున్న కేరీ, సజనా**
టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబైకి ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్ కెర్ (4)తో పాటు స్టార్ ఆల్‌రౌండర్ సీవర్ బ్రంట్ (4) నిరాశపరిచినా కమిలిని (28 బంతుల్లో 32, 5 ఫోర్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (17 బంతుల్లో 20, 1 ఫోర్, 1 సిక్స్) వేగంగా ఆడే యత్నం చేశారు. కానీ ఈ ఇద్దరి నిష్క్రమణతో 67/4గా ఉన్న ముంబైని కేరీ, సజనా ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు 49 బంతుల్లోనే 82 రన్స్ జతచేసిన ఈ జోడీ ముంబైకి పోరాడగలిగే స్కోరును అందించింది.

**సంక్షిప్త స్కోర్లు**
ముంబై: 20 ఓవర్లలో 154/6 (సజనా 45, కేరీ 40, క్లెర్క్ 4/26, బెల్ 1/14);
బెంగళూరు: 20 ఓవర్లలో 157/7 (నదైన్ 63లి, హారీస్ 25, కేరీ 2/35, కెర్ 2/13)

# సెమీస్‌కు సింధు.. సాత్విక్ జోడీ నిష్క్రమణ

కౌలాలంపూర్
కాలి గాయం నుంచి కోలుకుని తొలి టోర్నీ ఆడుతున్న పీవీ సింధు.. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ మలేషియా ఓపెన్‌లో సెమీస్‌కు చేరింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు.. ప్రపంచ చాంపియన్, జపాన్‌కు చెందిన అకానె యమగుచిపై గెలిచి లాస్ట్-4కు అర్హత సాధించింది.
క్వార్టర్స్ పోరులో భాగంగా సింధు తొలి గేమ్‌ను 21-11తో గెలుచుకున్న తర్వాత రెండో గేమ్‌లో జపాన్ అమ్మాయి మోకాలి నొప్పి బాధపడుతూ ఆట నుంచి తప్పుకుంది. కాగా పురుషుల డబుల్స్‌లోనూ భారత పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌లో స్టార్ షట్ల ద్వయం సాత్విక్, చిరాగ్ 10-21, 21-23తో ఆరో సీడ్ ఇండోనేషియా జోడీ అల్ఫియన్, షోహిబుల్ ఓటమిపాలయ్యారు.




# స్పోర్ట్స్

## బంగ్లా ప్లేయర్లకు స్పాన్సర్ల గండం!

బ్యాటర్ల స్పాన్సర్‌షిప్‌ను రద్దుచేసుకోనున్న ఎస్‌జీ?



ఢాకా
ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ రెహ్మాన్ విడుదల అనంతరం జరుగుతున్న పరిణామాలు ఆ దేశ క్రికెట్ బోర్డుకే గాక ఆటగాళ్లకూ కొత్త తలనొప్పులు తీసుకొస్తున్నాయి. తమ దేశ గౌరవాన్ని తాకట్టుపెట్టి భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడబోమని ఆ బోర్డు మొండికేస్తున్న నేపథ్యంలో ఆ జట్టు ఆటగాళ్లకు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్న పలు సంస్థలు వారితో కాంట్రాక్టులను రద్దు చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. లిటన్ దాస్, మొమినుల్ హక్, యాసిర్ రబ్బి వంటి బ్యాటర్లకు బ్యాట్ స్పాన్సర్‌గా ఉన్న భారత కంపెనీ ఎస్‌జీ (సాన్స్‌పరీల్స్ గ్రీన్‌లాండ్స్).. వారితో స్పాన్సర్‌షిప్‌ను పునరుద్ధరించే అవకాశం లేదని ఏజెంట్లతో ఇప్పటికే అనధికారిక సమాచారం పంపినట్టు తెలుస్తున్నది. ఒకవేళ ఎస్‌జీ గనక ఈ నిర్ణయం తీసుకుంటే వారితో కాంట్రాక్టులున్న మిగిలిన సంస్థలూ ఇదే బాటలో వెళ్లే అవకాశం లేకపోలేదు